క్లుప్తంగా

జీఎస్టీపై అవగాహన


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ విధానంతో పలు వస్తువుల ధరలు తగ్గాయని ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు వివిధ శాఖల అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ధరలు తగ్గడం వల్ల సామాన్య ప్రజలకు ఊరట లభించిందన్నారు. 375 రకాల వస్తువులపై ధరలు తగ్గాయని తెలిపారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా తైక్వాండో అండర్–14 భాగంలో వంశీ బంగారు పతకం, శివగౌతమ్, హస్నిక కాంస్య పతకాలను సాధించారు. బంగారు పతకం సాధించిన వంశీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 29, 30 తేదీల్లో నాగాలాండ్ రాష్ట్రం కోహిమాలో జరిగే క్రీడల్లో పాల్గొననున్నట్లు హెచ్ఎం చెన్నకేశ్వరి తెలిపారు. మంగళవారం పీడీ దేవేంద్ర, విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ప్రధాని సభను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు రానున్నారని, సభను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పొదుపు లక్ష్మి గ్రూపు సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 15 బస్సులు కేటాయించారన్నారు. ఈ బస్సులు 16వ తేదీ ఉదయం 7 గంటలకు ఆయా గ్రామాల నుంచి కర్నూలుకు బయలుదేరనున్నట్లు వెల్లడించారు. ఒక్కో బస్సులో 40 మంది వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థినులకు రక్త వర్గాల నిర్ధారణ పరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మంగళవారం రక్త వర్గాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. మొదటి సంవత్సరం ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ప్రోగ్రాం ఆఫీసర్లు విజయానంద్, రామలింగారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థినులకు ఏదైనా అనారోగ్యం చేస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల వైద్యులు దివ్య, టెక్నీషియన్ నర్సయ్య, ఏఎంఎం మేరీ పాల్గొన్నారు.

అష్టాదళ పాదపద్మారాధన సేవ


కాళికాంబదేవి

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. తదుపరి 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ, మహామంగళహారతులు ఇచ్చారు. భక్తులకు శ్రీకాళిమాత సేవా సమితి తరఫున అన్నప్రసాదం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగబోతున్న పల్లె అలారం

- గ్రామాల్లో కనుమరుగవుతున్న నాటుకోళ్లు
- గుడ్లు పొదిగించే సంస్కృతికి స్వస్తి చెబుతున్న పల్లె వాసులు

నంద్యాల(అర్బన్): ఒకప్పుడు గ్రామీణ పల్లెలు కోడి కూతతో నిద్రలేచేవి. గడియారాలు లేని కాలంలో గ్రామీణులకు అదే అలారం. నాడు పల్లెల్లో ఏ ఇంటిలో చూసినా పదుల సంఖ్యలో నాటుకోళ్లు కనిపించేవి. ఇంట్లో మనుషులతో పాటు కోళ్లు కూడా తిరిగేవి. నాలుగు గింజలు చల్లి బొబ్బొబ్బొ.. అంటే ఇంటిముందు వాలిపోయేవి. మనిషికి కోళ్లకు ఉన్న అనుబంధం అలాంటిది. నేడు పల్లెసీమల జీవన చిత్రం మారిన నేపథ్యంలో కోడికూత వినిపించడమే గగనమైంది.

కోడి ఊరికి దూరమవుతోంది

చీకటిపడుతుంటే కోళ్లు ఎక్కడున్నా కష్టం మీద పట్టుకొచ్చి గంప కింద కప్పేస్తాం. తెల్లారుతుండగా బయటకు వదిలి గుడ్డుకోసం ఆతృతగా వెతుకుతాం. సూర్యోదయానికి కొన్ని గంటల ముందే అందరిని నిద్రలేపేలా తొలి కూతలు, పెట్టె కొసం పరుగులు పెట్టే పుంజులు, గుడ్లను పొదుగుతున్న కోడితో తన్నులాటలు.. నేడు ఇవన్ని జ్ఞాపకాలుగా మిగిలే పరిస్థితులు నెలకొన్నాయి. తెల్లవారకముందే పల్లెవాసులను నిద్రలేపే కోడి క్రమంగా ఊరికి దూరమవుతుందని చెప్పవచ్చు.


కనిపించని నాటుకోళ్లు

నాటుకోళ్ల పెంపకం క్రమంగా తగ్గుతోంది. ఒకప్పుడు చిన్న గ్రామంలోనైనా 2 వేల నుంచి 5వేల వరకు నాటుకోళ్లు ఉండేవి. జిల్లాలోని 411 గ్రామ పంచాయతీల్లో గతంలో 10 నుంచి 12 లక్షల కోళ్లు ఉండగా ప్రస్తుతం 6 లక్షల కోళ్లు మాత్రమే ఉన్నట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. గతంలో నాటు గుడ్లను పొదిగే అలవాటు ఉండేది. పేద, మధ్యతరగతి ప్రజలు కుటుంబ అవసరాల నిమిత్తం 20 నుంచి 30 గుడ్లను పొదిగించేవారు. వాటి నుంచి కోడిపిల్లలు రావడం, అవిపెరిగి పెద్దవ్వడం, బంధువులు వస్తే కోళ్లను కోయడం కనిపించేది. పెట్టలు గుడ్లు పెట్టడం, పొదిగి పిల్లలు అవడం. ఇలా నాటుకోళ్ల గ్రామాల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతుండేవి. ఇప్పుడా పరిస్థితి గ్రామాల్లో కనిపించడంలేదు.

నాటుకోడి కనుమరుగవడానికి కారణాలు

- పల్లెలో దారిద్ర్యరేఖకు దిగువన ఉండే కుటుంబాల ఆదాయం పెరగడం
- గుడ్లను పొదిగించేందుకు కోళ్లకు అనువైన స్థలం లేకపోవడం.
- నాటుగుడ్లను ఎక్కువగా ఆహారం తీసుకుంటున్నారు గానీ గుడ్లను పొదిగించే వారు లేకపోవడం.
- పల్లె వాసులు పట్టణాలకు వలస రావడం.

దసరా వచ్చిందంటే నాటుకోడి ఉండాల్సిందే

సంక్రాంతి, దసరా పండుగలు వచ్చాయంటే ఇప్పటికీ నాటుకోడి, జొన్నరొట్టె, రాగిసంకటి కాంబినేషన్ ఉండాల్సిందే. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలకు పరిమితమైన నాటుకోడి వంటకాలు పలు రూపాలను సంతరించుకుని ఇప్పుడు పట్టణాలు, సిటీల్లో కేక పుట్టిస్తున్నాయి. ప్రత్యేకంగా నాటుకోడి కూర పేరిట రెస్టారెంట్లు వెలుస్తున్నాయి. నాటుకోడి పులుసు, జొన్నరొట్టెలకే పరిమితం కాకుండా పలురకాల వంటకాలకు కాంబినేషన్‌గా అందిస్తున్నారు.

కేజీ నాటుకోడి రూ.600పై మాటే

బాయిలర్ కోళ్లకు అలవాటు పడిన ప్రజల మనసు తిరిగి నాటుకోళ్ల వైపు మళ్లింది. బాయిలర్ కోళ్ల చప్పగా ఉండడం, కృత్రిమ పెంపకం వంటి కారణాలతో నాటుకోడికి డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం కేజీ నాటుకోడి రూ.600 నుంచి రూ.700 పలుకుతోంది. డజను కోడిగుడ్లు రూ.70 నుంచి రూ.80తో అమ్మకాలు జరుగుతున్నాయి.

నాటుగుడ్లలో పోషకాలు అనేకం

మిటమిన్లు, ప్రొటీన్లు ఇతరత్రా బలవర్ధకాలు బాయిలర్ గుడ్డుకంటే నాటుగుడ్లలోనే ఎక్కువగా లభిస్తాయి. మిటమిన్–ఏ ఈ గుడ్లలో అధికంగా ఉంటుంది. నాటుగడ్లను తినిపించడం వల్ల పిల్లలో ప్రధానంగా దృష్టి లోపాన్ని నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఈ గుడ్లను తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు.

ఇంటి నిండా కోళ్లు ఉండేవి



నేను వయస్సులో ఉన్నప్పుడు మా ఇంటి నిండా నాటుకోళ్లు ఉండేవి. మానాన్న వీటిని ప్రత్యేకంగా పెంచేవారు. గంపల కింద వీటిని పెట్టేవారం. ఇప్పుడు నాకు నలుగురు కుమారులు. వారు కూడా పెద్దవారు అయ్యారు. మా ఇంటిలో ఇప్పుడు ఒక కోడి కూడా లేదు. స్థలం సమస్య, ఇంటిపక్క వారితో ఇబ్బందులు వంటి కారణాలతో పూర్తిగా పెంచడమే మానేశాం.

–దూదేకుల ఖాశీంబీ, కానాల

కనుమరుగవుతున్న నాటుకోళ్లు



మా గ్రామంలో నాటుకోళ్లు అధికంగా ఉండేవి. నేడు ఎవరూ వీటిని పెంచడం లేదు. నాటుకోడి మాంసం తినాలన్నా పట్టణాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం కోడికూతలు వినిపించడం లేదు. నాటుకోడి బలమైన ఆహారం. నేటి యువకులు బర్గర్లు, స్వీట్లు కాకుండా నాటుకోడి తింటే మంచిది.

–మహబూబ్ బాషా, మంచాలకట్ట, గడివేముల

సీపీఆర్‌పై అవగాహన అవసరం

గోస్పాడు: గుండెపోటు లేదా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ రక్షణకు అత్యంత కీలకమైన సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెససిటేషన్) విధానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మదనమోహన్ అన్నారు. మంగళవారం కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇన్‌చార్జ్ హెచ్ఓడీ డాక్టర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జాతీయ సీపీఆర్ అవగాహన వారోత్సవాన్ని అక్టోబర్ 13 నుంచి 17వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండెపోటు సంభవించినప్పుడు గుండె ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ విధానం ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని చెప్పారు. గుండెపోటు వచ్చిన నిమిషాల్లోనే సీపీఆర్ చేస్తే జీవితావకాశాలు రెండింతలు నుంచి మూడింతల వరకు పెరుగుతాయని తెలిపారు. ప్రతి పౌరుడు ఈ నైపుణ్యాన్ని నేర్చుకోవడం సమాజానికి ఎంతో ఉపయోగకరం అని డాక్టర్ సురేఖ తెలిపారు. సమాజంలో ప్రతి ఇంట్లో, ప్రతి కార్యాలయంలో కనీసం ఒకరు సీపీఆర్ నేర్చుకుంటే, ఒక ప్రాణ రక్షకుడు మన చుట్టుపక్కల ఉంటాడని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో సమయానికి సీపీఆర్ చేయడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడిన ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు. తరువాత సీపీఆర్ ప్రదర్శనలు, పోస్టర్ ఎగ్జిబిషన్, ప్రమాణ స్వీకారం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్లు విజయకుమారి, నిరంజన్, మెడిసిన్ విద్యార్థులు పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వదలని వర్షం.. ముందుకు సాగని రబీ


ఉయ్యాలవాడలో పొలంలో నిలిచిన వర్షపు నీరు


అల్లూరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

- పొలాల్లో తొలగని వర్షపు నీరు
- పంటల సాగుకు ఆటంకం
- ఆందోళనలో అన్నదాతలు

ఉయ్యాలవాడ: వరుణుడు ఉయ్యాలవాడ మండలంపై విరుచుకుపడుతూనే ఉన్నాడు. నెలరోజులుగా ప్రతి రోజు వర్షం పడుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కూడా మండలంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రబీ పంటల సాగు సీజన్ మొదలవుతుండగా వరుస వర్షాలు రైతుల ప్రణాళికలను చెదరగొడుతున్నాయి. రసాయన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు భూమి తడి ఆరక సాగు ప్రారంభించలేకపోతున్నారు. వర్షాల కారణంగా పొలాల్లో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి సాగు పనులకు అడ్డంకిగా మారాయి. ప్రతి ఏడాది దసరా అనంతరం పప్పు, శనగ విత్తనం వేసే రైతులు ఈసారి వర్షాల కారణంగా దిగాలు చెందుతున్నారు. మండలంలో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 12,700 హెక్టార్లు కాగా, ఈసారి రైతులు 14,000 హెక్టార్లలో శనగ సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

వానొస్తే అవస్థలే

మండలంలోని అల్లూరు, మాయలూరు, హరివరం, బోడెమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, పుచ్చకాయలపల్లె గ్రామాల్లో వర్షపు నీరు వెళ్లే దారిలేక ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ప్రజలు అవస్థలు పడుతున్నారు. నీరు వెళ్లేందుకు మార్గం లేక వీధులే చిన్న చెరువుల్లా మారిపోతున్నాయి. మురుగుకాలువలు సరిగా లేకపోవడంతో వర్షపు నీరు వీధుల్లోనే పొంగి పొర్లుతూ దుర్గంధం వెదజల్లుతోంది. నిలిచిపోయిన నీరు దోమలకు నిలయంగా మారుతోంది. దోమల బెడదతో రాత్రిళ్లు నిద్ర పోలేకపోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు వర్షపునీరు, మురుగును బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్య రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కూలీల కుటుంబాలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): గడివేముల మండలం పెసరవాయి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ పనుల నిమిత్తం బండిఆత్మకూరు మండలం దేవళాపురం, మోతుకూరు, బోధనం గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు పెసరవాయి గ్రామానికి వెళుతూ 20 మంది కూలీలు గాయపడ్డారన్నారు. సుదూర ప్రాంతాలకు పరిమితికి మించి ఆటోల్లో వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లోనే పనులు కల్పిస్తే ఇలాంటి ఘటనలు జరగవన్నారు. సంఘం నాయకులు నరసింహానాయక్, సుధాకర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పరం చేస్తే ఉద్యమిస్తాం

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని చూస్తే ఉద్యమిస్తామని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బండి దేవాంతకుడు, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి హెచ్చరించారు. కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే పేదలు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. మంగళవారం స్థానిక అబాండంతండా సమీపంలోని కార్యాలయ ఆవరణలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాలలపై దాడులు అధికమయ్యాయన్నారు.

ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గోస్పాడు: ఏపీకి ఇచ్చిన హామీలను కేంద్రం విస్మరించిందని సీపీఐ నాయకులు హరినాథ్, జిలానీ బాషా అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటనకు వ్యతిరేకంగా మంగళవారం గోస్పాడులో సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు, కరెంట్ చార్జీలు, నిత్యావసర సరుకులు విపరీతంగా పెరిగాయని, ఈ ధరలను తగ్గించాలన్నారు. నరేంద్రమోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, పాపన్న, తిమ్మన్న, లక్ష్మన్న, సుబ్బరాయుడు, శీను, హుసేని, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి బేస్‌బాల్, క్రికెట్ పోటీలకు నంద్యాల పట్టణంలోని గురురాజ పాఠశాల క్రీడాకారులు ఎంపిక కావడం అభినందనీయమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. మంగళవారం ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఆవరణలో స్కూల్ డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి, మౌలాలిరెడ్డి, శాప్ చైర్మన్ అభినందించారు. ఈనెల 13వ తేదీ కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో జరిగిన అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో కరీముల్లా, కృపా, క్రికెట్ పోటీల్లో ధరణి, చంద్రకళ, గగన, సుదీప్తి, చిన్న ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పీఈటీలు పుల్లయ్య, రాజును అభినందించారు.

- **రుద్రవరం:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న పూజిత, మొదటి సంవత్సరం విద్యార్థిని హృదయభాను రాణించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ఆలయానికి రూ.4లక్షల ఆదాయం


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేట ఆంజనేయ, కోదండరామస్వామి ఆలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఏడు నెలలకు సంబంధించి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.4,01,809 ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, శ్రీబాలాజీ సేవా ట్రస్టు సేవకులు పాల్గొన్నారు.

ఇంజక్షన్‌తో పెయ్యదూడల పుట్టుక సాధ్యం


పశువీర్య దోస్‌లను అందజేస్తున్న అధికారులు

డోన్: పశుసంవర్ధక రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని ఉమ్మడి కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి శాఖ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో లింగనిర్ధారిత పశువీర్య డోస్‌లను ఏడీఏ డాక్టర్ నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రూ.150 మాత్రమే చెల్లించి పశుపోషకులు లింగనిర్ధారిత వీర్యాన్ని పొందవచ్చని తెలిపారు. గతంలో దీని ధర రూ.500 ఉండేదని పేర్కొన్నారు. ఈ ఇంజక్షన్‌తో 90 శాతం పెయ్య దూడలు పుట్టే అవకాశం ఉందని తెలిపారు. గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ సహకారంతో ప్రభుత్వం ఈ సాంకేతికతను అభివృద్ధి చేసిందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, గౌసియా, భాను, సిబ్బంది మహమ్మద్ రఫీ, నవ్య, హైమావతి, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయుడు మృతి తీరని లోటు


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): సాగునీటి ప్రాజెక్టుల రూపకర్త, విశ్రాంత డిప్యూటీ ఇంజినీర్ సుబ్బరాయుడు మరణం రైతు లోకానికి తీరని లోటు అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఎం నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం పాటు పడిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. అలాగే ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సీపీఐ నాయకుడు రామాంజనేయులు, రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ సుబ్బరాయుడు సంతాపం వ్యక్తం చేశారు. రాయలసీమ నీటి పారుదల ప్రాజెక్టు స్థితిగతులు, తుంగభద్ర నది జలాల సద్వినియోగం చేసుకోవడానికి వేదావతి, ఎత్తిపోతల, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేయాలన్న ఆశయం ఆయనదేనన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, శ్రీశైలం కుడి బ్రాంచ్ కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో ఇంజినీరింగ్ బాధ్యతలను అంకిత భావంతో పని చేశారన్నారు.

- **నంద్యాల(అర్బన్):** సాగునీటి రంగ సాంకేతిక నిపుణుడు సుబ్బరాయుడు మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు అని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్, వేదావతి ఎత్తిపోతల పథకం, తుంగభద్ర వరద కాల్వ, తదితర అనేక కీలక నిర్మాణాలకు సాంకేతిక నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారని, ఆయన మరణం రాయలసీమ ప్రగతికి తీరని లోటు అన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

శిరివెళ్ల: గుంప్రమాన్‌దిన్నెకు చెందిన డిగ్రీ విద్యార్థిని వెన్నెల (17) అదృశ్యమైనట్లు ఎస్ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. ఆమె నంద్యాలలోని ఓ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల దసరా సెలవులు రావడంతో ఇంటికి వచ్చింది. ఈ నెల 13వ తేదీ ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని చిన్నకందుకూరు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయలక్ష్మి (60) అనే మహిళ మృతి చెందారు. నంద్యాల బొమ్మలసత్రం కాలనీకి చెందిన విజయలక్ష్మి పెద్దముడియం మండలం పాలూరు గ్రామంలో ఉన్న పెద్దమ్మ మృతి చెందడంతో అక్కడికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో తమ్ముడు ఏవీ సుబ్బారెడ్డితో కలిసి బైక్‌పై నంద్యాలకు బయలుదేరారు. ఆళ్లగడ్డ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా జమ్మలమడుగు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రావడంతో సైడు ఇచ్చే క్రమంలో పక్కనే రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలపైకి పోవడంతో అదుపు తప్పి కిందపడ్డారు. కిందపడ్డ విజయలక్ష్మిపై ఆర్టీసీ బస్సు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నెలో ఉద్యానవన, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహన కల్పించారు. పంట నిర్వహణ అధికారి రవళి, కంపెనీ ప్రతినిధి రమణారెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు ఎకారకు 57 మొక్కలు, రసాయన ఎరువులు, పంట సాగుకు అయ్యే పెట్టుబడుల నిమిత్తం ఏడాది రూ. 10,500 చొప్పున నాలుగేళ్లు అందజేస్తారన్నారు. పంట సాగు చేసిన నాల్గో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుందని, సాగునీటి వసతి కలిగిన రైతులు పంట సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.


శిరివెళ్ల మెయిన్ రోడ్డుపై నీరు (ఫైల్)


పాఠశాలకు వెళ్లుటకు విద్యార్థుల అవస్థలు

ఇది రోడ్డే.. చెరువు కాదు

శిరివెళ్ల: మండల కేంద్రం శిరివెళ్ల ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డులో వెళ్లాలంటే ప్రజలకు నరకమే. పాత స్టేట్‌బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, శ్రీవాణి స్కూల్ వద్ద వర్షపు నీరు రోజులు తరబడి నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. మండల కార్యాలయాలు, పాఠశాలలు, వారపు సంత, బ్యాంక్‌లకు ఈ రోడ్డుపైనే వెళ్లాల్సి ఉంటుంది. ప్రతిరోజూ వందలాది వాహనాలు, ప్రజలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే మూడునాలుగు రోజులు నీరు నిల్వ ఉంటోంది. ఇటీవల వర్షాల కారణంగా నీరు నిలిచిపోవడంతో పంచాయతీ అధికారులు మోటార్ పెట్టి నీరు తోడే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. లో లెవెల్ ప్రదేశాల్లో రోడ్డు ఉండడమే సమస్యకు కారణమని అభిప్రాయపడ్డారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.